క్లుప్తంగా

గంట్యాడ తహసీల్దార్‌గా నీలకంటేశ్వరరెడ్డి


తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీటీ స్వర్ణకుమార్

గంట్యాడ: మండల తహసీల్దార్‌గా పి.నీలకంటేశ్వరరెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. విశాఖపట్నం జిల్లా మునగపాక మండలం డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేసి పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. రెవెన్యూశాఖలోకి రాక ముందు ఆయన ఎక్సైజ్‌శాఖ సీఐగా పనిచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సేవలను ప్రజలకు మరింత చేరువ చేస్తానని, భూరీసర్వే శతశాతం పూర్తి చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఇంతవరకు డీటీ కె.స్వర్ణకుమార్ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా ఇక్కడ పనిచేశారు.

దావాలపేటలో 'ఫ్యామిలీ డాక్టర్'


శిబిరంలో వైద్యసేవలందిస్తున్న డాక్టర్ లోకప్రియ

గజపతినగరం: గజపతినగరం సచివాలయం -2 పరిధి దావాలపేట గ్రామంలో మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి లోకప్రియ ఆధ్వర్యంలో గురు వారం 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం నిర్వహించారు. శిబిరంలో 64 మందికి వివిధ వైద్యపరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం గృహ సందర్శన చేసి శిబిరానికి రాలేని గర్భిణులు ,బాలింతలు, చిన్నారులు, వృద్ధులను వైద్య తనిఖీలు చేశారు. ఎంఎల్‌హెచ్‌పీ శివానీ, ఆరోగ్య కార్యకర్త బేగమ్, ఆశ కార్యకర్త పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఓకు షోకాజ్ నోటీసు

దత్తిరాజేరు: విధుల్లో అలసత్వం వహించడం వల్ల మండలంలోని టి.భూర్జవలస వీఆర్‌ఓ ఎం.కూర్మారావుకు ఆర్డీఓ శేషశైలజ ఆదేశాల మేరకు షోకాజ్ నోటీసు జారీ చేశామని డీటీ రమేష్ గురువారం తెలిపారు. బుధవారం సాయంత్రం దత్తిరాజేరు రెవెన్యూ కార్యాలయంలో వీఆర్‌ఓల తో ఆర్డీఓ సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షకు వీఆర్‌ఓ కూర్మారావు హాజరు కాకపోగా, ఫోన్ చేసినా స్పందించలేదని డీటీ చెప్పారు. అలాగే మ్యుటేషన్లు సకాలంలో పూర్తి చేయకపోవడం,బొబ్బిలి ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షకు హాజరు కాకపోవడం తదితర కారణాలతో షోకాజ్ నోటీస్ జారీ చేశామని వివరించారు.

ఘనంగా దుర్గాలమ్మ పండగ


డప్పు వాయిద్యాలతో అమ్మవారి ఆలయానికి వెళుతున్న గ్రామస్తులు

వేపాడ: మండలంలోని బొద్దాం గ్రామంలో దుర్గాలమ్మ పండగను గ్రామస్తులు గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ఏటా వరినాట్లు పూర్తికాగానే వచ్చిన తొలి గురువారం దుర్గాలమ్మ పండగ, తర్వాత వచ్చే ఆదివారం పశలమ్మ పండగ నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోందని గ్రామపెద్దలు తెలిపారు. అందులో భాగంగానే ఈఏడాది కూడా దుర్గాలమ్మ ఆలయానికి గ్రామస్తులు డప్పువాయిద్యాలతో వెళ్లి అమ్మవారికి పసుపు, కుంకుమ, చీరలు సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

అన్నదానం


భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

చీపురుపల్లి రూరల్: మండలంలోని పుర్రేయవలస గ్రామంలో వినాయకనవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గురు వారం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఇప్పిలి అనంతం, బెల్లాన వంశీకృష్ణ ప్రారంభించారు. నాయకులు రేవళ్ల సత్తిబాబు, ఇప్పిలి తిరుమల, కంది పాపినాయుడు, కంది అప్పారావు, జమ్ము శ్రీరాములు, అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

రైతుభరోసాకు దరఖాస్తు చేసుకోండి

బొండపల్లి: కొత్తగా వన్‌బీలు వచ్చిన రైతులు, ఇదివరకు వైఎస్సార్ రైతు భరోసా పథకం ద్వారా పెట్టుబడి సాయం అందుకోని వారు పథకం కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏఓ పి.వి.మల్లికార్జునరావు గురువారం ఓ ప్రకటనలో సూచించారు. రైతులు సంబంధిత రైతు భరోసా కేంద్రాల్లోని వీఏఏలను సంప్రదించి, వన్‌బీతో పాటు ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా వివరాలు అందించాలని తెలిపారు.

గురజాడ ప్రస్థానం చిరస్మరణీయం

- ఘనంగా గురజాడ అప్పారావు జయంతి

శృంగవరపుకోట: నవయుగ వైతాళికునిగా ఆధునిక తెలుగు కవుల్లో మహాకవి గురజాడ వేంకట అప్పారావు ప్రస్థానం చిరస్మరణీయమని ధర్మవరం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బి.ఉమామహేశ్వరరావు అన్నారు. గురజాడ అప్పారావు జయంతిని పాఠశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. గురజాడ చిత్రపటానికి ఉపాధ్యాయులతో కలిసి పూలమాలలు వేసి, అంజలి ఘటించారు. గురజాడ చేసిన సాహితీసేవను, పుత్తడిబొమ్మ పూర్ణమ్మ, కన్యాశుల్కం, దిద్దుబాటు వంటి రచనల గొప్పతనాన్ని విద్యార్థులకు హెచ్‌ఎం, ఉపాధ్యాయులు వివరించారు.

తెలుగు సాహిత్యానికి మేలిమలుపు

గజపతినగరం: స్థానిక శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ వై.స్వప్న ఆధ్వర్యంలో మహాకవి గురజాడ వేంకట అప్పారావు జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. గురజాడ చిత్రపటానికి పాఠకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ మాట్లాడుతూ ఆధునిక తెలుగు సాహిత్యాన్ని మేలిమలుపు తిప్పిన మహాకవి గురజాడ అడుగుజాడల్లో అంతా నడుచుకుందా మని అన్నారు. అనంతరం గురజాడ రచించిన కన్యాశుల్కం నాటకం గురించి పాఠకులకు వివరించారు.

సమాజాన్ని సంస్కరణ బాటపట్టించారు

వేపాడ: బక్కునాయుడుపేట మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ ఈశ్వరరావు ఆధ్వర్యంలో గురజాడ అప్పారావు జయంతిని గురువారం నిర్వహించారు.


కొత్తవలస: తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో గురజాడ విగ్రహానికి పూలమాల వేస్తున్న డీటీ రమేష్ , తదితరులు

గురజాడ చిత్రపటానికి ఉపాధ్యాయులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు గురజాడ రచనలను విద్యార్థులకు వివరించారు. గురజాడ కలం నుంచి జాలువారిని ప్రతీ అక్షరం సమాజాన్ని సంస్కరణ బాటపట్టించేలా ప్రశ్నించిందని అన్నారు. అప్పటి సాంఘిక దురాచారాలను గురజాడ తన రచనలతో తీవ్రంగా వ్యతిరేకించారన్నారు.

అలరించిన దేశభక్తి గేయాల ఆలాపన

చీపురుపల్లి: గురజాడ అప్పారావు జయంతిని పురస్కరించుకుని స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక మండల అధ్యక్షుడు వి.మోహనరావు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన గురజాడ రచనలకు సంబంధించిన దేశభక్తి గేయాల ఆలాపన అలరించింది. 'దేశమంటే మట్టి కాదోయ్ దేశమంటే మనుషులోయ్' వంటి గేయాలను ఆలపించి, గురజాడ అప్పారావు ఔన్నత్యాన్ని విద్యార్థులకు వివరించారు. జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు రమణ, అప్పలనాయుడు పాల్గొన్నారు.


గజపతినగరం: శాఖా గ్రంథాలయంలో గురజాడ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న లైబ్రేరియన్ స్వప్న, తదితరులు

తహసీల్దార్ కార్యాలయంలో..

కొత్తవలస: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురజాడ అప్పారావు జయంతిని గురువారం నిర్వహించారు. కార్యాలయ ఆవరణలోని ఆయన విగ్రహానికి డీటీ టి.రమేష్, కార్యాలయ సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలుగ్రామాల వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో..

లక్కవరపుకోట: మండలంలోని జమ్మాదేవిపేట గ్రామ సమీపంలోని మహాత్మా జ్యోతిరావు పూలే ఆశ్రమ పాఠశాలలో గురజాడ జయంతి వేడుకలు గురువారం నిర్వహించారు. గురజాడ చిత్రపటానికి ప్రిన్సిపాల్ యు.విజయకుమార్‌పాత్రో, ఉపాధ్యాయ సిబ్బంది పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. అలాగే కొట్యాడ ఉన్నత పాఠశాలలో గురజాడ విగ్రహానికి హెచ్‌ఎం పద్మావతి, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.


లక్కవరపుకోట: మోడల్ స్కూల్‌లో గురజాడ రచనలను విద్యార్థులకు వివరిస్తున్న ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్‌పాత్రో


శృంగవరపుకోట: ధర్మవరం హైస్కూల్‌లో గురజాడకు నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు


వేపాడ: మోడల్ స్కూల్‌లో గురజాడ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ ఈశ్వరరావు, ఉపాధ్యాయులు


లక్కవరపుకోట: కొట్యాడ హైస్కూల్‌లో గురజాడ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు


చీపురుపల్లి: బాలుర ఉన్నత పాఠశాలలో గురజాడ రచించిన గేయాలను ఆలపిస్తున్న జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు

ఈ-క్రాప్ నమోదును వేగవంతం చేయాలి


గుర్ల: వల్లాపురంలో ఈ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న జేడీ రామారావు

గుర్ల: మండలంలో వరిపంటకు సంబంధించి ఈ-క్రాప్ నమోదును వేగవంతం చేయాలని వీఏఏలకు విజయనగరం జేడీ వి.టి.రామారావు ఆదేశించారు. వల్లాపురంలో వ్యవసాయ సిబ్బంది చేపడుతున్న ఈ-క్రాప్ నమోదును గురువారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా జేడీ మాట్లాడుతూ మండలంలో ఈ-క్రాప్ నమోదు 70శాతం పూర్తయిందని, మిగిలిన 30 శాతం త్వరగా పూర్తిచేయించాలని ఏఓ తిరుపతిరావుకు సూచించారు. రైతులంతా తప్పనిసరిగా ఈ-క్రాప్ చేయించుకోవాలని, ఈ-క్రాప్ చేయించుకుంటేనే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేస్తారని తెలిపారు.


దత్తిరాజేరు: దత్తిరాజేరులో రైతులకు అవగాహన కల్పిస్తున్న వీఏఏ, రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధి

రైతులకు అవగాహన

దత్తిరాజేరు: ఈ-క్రాప్ చేయించుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలపై రిలయన్స్ ఫౌండేషన్, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రానికి చెందిన రైతులకు గురువారం అవగాహన కల్పించారు. రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధి సురేష్, గ్రామ సచివాలయ వీఏఏ ఎస్. సతీష్ పొలాల్లో రైతుల వద్దకు వెళ్లి ఈ-క్రాప్‌పై అవగాహన కల్పించారు. ప్రతీ పంటను ఈ-క్రాప్‌లో నమోదు చేసుకోవాలని చెప్పారు. రైతులు తమ ఆధార్ కార్డ్, వన్‌బీ లేదా భూమి పాస్ బుక్ జెరాక్స్‌లను వ్యవసాయ సిబ్బందికి అందజేస్తే వారు ఈ-క్రాప్‌లో పంటల వివరాలను నమోదు చేస్తారని వివరించారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పంటకు నష్టం వాటిల్లితే, ఈ-క్రాప్‌లో నమోదైన పంటలకే ప్రభుత్వం పరిహారం అందిస్తుందని చెప్పారు.

విద్యార్థినులకు రక్తపరీక్షలు


విద్యార్థినులకు రక్త పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

వేపాడ: బక్కునాయుడుపేట సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలోని 473 మంది విద్యార్థినులకు వేపాడ పీహెచ్‌సీ వైద్యాధికారి ధరణి ఆదేశాల మేరకు వైద్యసిబ్బంది గురువారం రక్త పరీక్షలు(హిమోగ్లోబిన్) నిర్వహించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ టి.ఎం.ఫ్లోరెన్స్, వైస్ ప్రిన్సిపాల్ ఉషారాణి, ఏఎన్‌ఎంలు, హెచ్‌ఎస్, ఎంఎల్‌హెచ్‌పీలు, పాఠశాల నర్స్ శారద పాల్గొన్నారు.

అగ్నిమాపక కేంద్రం సందర్శన


ఆర్‌ఎఫ్‌ఓ నిరంజన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న అగ్నిమాపక అధికారి అశోక్‌కుమార్

కొత్తవలస: మండలంలోని తుమ్మికాపల్లి సమీపంలో ఉన్న అగ్నిమాపక కేంద్రాన్ని నార్త్ జోన్-1 రీజనల్‌ఫైర్ ఆఫీసర్ (ఆర్‌ఎఫ్‌ఓ) డి.నిరంజన్‌రెడ్డి గురువారం సందర్శించారు. స్థానిక అగ్నిమాపక అధికారి వై.అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది ఆయనకు గౌరవ వందనం సమర్పించారు. అనంతరం అగ్నిమాపక శకటం, పంపులు, ఇతర పరికరాలు, రికార్డులను ఆయన పరిశీలించారు. సిబ్బంది సక్రమంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఫైర్ సిబ్బంది ఎస్.కనకారావు, పి.త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

మెస్ చార్జీలు పెంచాలని ధర్నా

శృంగవరపుకోట: ప్రభుత్వ వసతి గృహాల్లో మౌలిక వసతులు మెరుగుపరచడంతో పాటు మెస్ చార్జీలను బహిరంగ మార్కెట్‌లో పెరిగిన ధరలకు అనుగుణంగా పెంచాలని ఎస్‌ఎఫ్‌ఐ నేతృత్వంలో విద్యార్థులు స్థానిక దేవీ జంక్షన్‌లో గురువారం ధర్నా నిర్వహించా రు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు మాట్లాడుతూ పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని కోరారు. ప్రభుత్వ యంత్రాంగం స్పందించకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

కౌలు రైతుల కోసం 'బ్యాంక్ బాట'

శృంగవరపుకోట: ప్రభుత్వ సూచనల మేరకు రైతాంగానికి సాయం చేసేందుకు వ్యవసాయశాఖ అధికారులు బ్యాంక్ బాట పట్టారు. కౌలు రైతులకు పంట రుణాలు ఇప్పించేందుకు ఈనెల 20 నుంచి 27 వరకు ప్రభుత్వం 'బ్యాంక్‌బాట' కార్యక్రమం నిర్వహిస్తోంది. అందులో భాగంగానే ఏఓ కె.రవీంద్ర స్థానిక ఎస్‌బీఐ అనుబంధ వ్యవసాయాభివృద్ధి బ్యాంక్, డీఓఐ మేనేజర్లను గురువారం కలిసి కౌలురైతులకు రుణాలు ఇవ్వాల్సిన అవసరాన్ని, వారి స్థితిగతులను వివరించారు. రుణాలు ఇచ్చి వ్యవసాయం చేసుకునేందుకు సహకరించాలని కోరారు. బ్యాంకర్లు సానుకూలంగా స్పందించారని ఏఓ తెలిపారు. ఏఓ వెంట వీఏఏ రవిచంద్ర, రైతులు ఉన్నారు.


కౌలు రైతులకు రుణాలు ఇప్పించాలని బ్యాంక్ మేనేజర్‌ను కోరుతున్న ఏఓ రవీంద్ర

ఉక్కు రక్షణ యాత్ర

చీపురుపల్లి: విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో గురువారం ఉక్కు రక్షణ యాత్ర పేరిట పట్టణంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి టి.వి.రమణ మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోరుతూ ఈనెల 29 వరకు ఉత్తరాంధ్ర జిల్లాల్లో బైక్ యాత్ర చేయనున్నట్లు తెలిపారు. 29న కూర్మన్న పాలెంలోని దీక్షా శిబిరం వద్దకు బైక్ యాత్ర చేరుకుంటుందని, అక్కడే బహిరంగ సభ ఉంటుందని చెప్పారు.


ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు,కార్మికులు

పాఠశాల సందర్శన

వేపాడ: మండలంలోని దబ్బిరాజుపేట ప్రాథమిక పాఠశాలను వేపాడ స్కూల్ కాంప్లెక్స్ చైర్‌పర్సన్ ఎస్.ఎస్.వల్లీ గురువారం సందర్శించారు. విద్యార్థుల హాజరు, నోట్, వర్క్ బుక్స్‌ను పరిశీలించారు. విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరీక్షించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనాలను మెనూ ప్రకారం రుచి, నాణ్యతతో అందించాలని వంట నిర్వాహకులకు సూచించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాల ని ఉపాధ్యాయులకు సూచించారు.


విద్యార్థుల వర్క్‌బుక్స్‌ను పరిశీలిస్తున్న స్కూల్ కాంప్లెక్స్ చైర్‌పర్సన్ వల్లీ

జాగ్రత్తలు తప్పనిసరి...

- వర్షా కాలంలో జీవాల కాళ్లకు పుండ్లు
- డాక్టర్ మర్రాపు శ్రీకాంత్

డెంకాడ: వర్షాకాలంలో మూగ జీవాల కాళ్లకు పుండ్లు (గిట్టల పుండ్లు వ్యాధి) అధికంగా సోకుతాయని..జాగ్రత్తలు పాటిస్తే జీవాలను రక్షించుకోవచ్చని అక్కివరం పశువైద్య కేంద్రం డాక్టర్ మర్రాపు శ్రీకాంత్ అన్నారు. ఈ మేరకు వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలపై ఆయన పలు సూచనలు చేశారు.

వ్యాధి లక్షణాలు..

వర్షాకాలంలో అన్ని రకాల జీవాలకు కాళ్ల పుండ్లు (డెక్క జడుపు) సోకుతాయి. గొర్రెలు, మేకలు, పశువులకు ఈ వ్యాధి సోకుంది. జీవాలకు గిట్టలు మధ్యలో చర్మం మెత్త బడి వాచిపోయి చిట్లిపోతుంది. చీము పట్టి నొప్పితో జీవాలు నడలేక చాలా ఇబ్బంది పడిపోతాయి.

చికిత్స..

వ్యాధి సోకిన జీవాల కాళ్లను (1:1000) కేఎన్‌ఎంవో4 ద్రావకంతో కడిగి అనంతరం బోరిక్ పౌడర్‌ను ఆయిల్‌లో కలిపి పూయాలి. యాంటీబయోటిక్ ఇంజిక్షన్లు వరుసగా 3 నుంచి 5 రోజుల పాటు చేయించాలి.


కాళ్ల పుండ్లు (డెక్కజడుపు) సోకిన మూగజీవం

జాగ్రత్తలు..

వ్యాధి సోకిన జీవాలను చిత్తడి నేలల్లో ఎక్కువగా తిరగనీయరాదు. పుండ్లు ఆశించిన వెంటనే వైద్యుల వద్దకు తీసుకెళ్లాలి.

ప్రాథమిక దశలోనే చికిత్స అందించాలి..

వర్షాకాలంలో కాళ్లకు పండ్లు సోకుతాయి. మూగజీవాలు, పశువులకు వ్యాధి సోకిన వెంటనే వైద్య చికిత్స చేయించాలి. లేకపోతే తీవ్ర అనారోగ్యం బారిన పడతాయి. గ్రామ సచివాలయాల్లో కూడా వెటర్నరీ అసిస్టెంట్లు అందుబాటులో ఉన్నారు.

– మర్రాపు శ్రీకాంత్, పశువైద్యాధికారి, అక్కివరం

అలుగు పారుతున్న చెరువులు


అలుగు పారుతున్న ఎల్.కోటలోని కిత్తన్నకట్టు చెరువు

లక్కవరపుకోట: గత రెండుచ మూడు రోజులుగా కురిసిన వర్షాలకు మండలంలోని వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. శ్రీరాంపురం గ్రామ సమీపంలోని కోటవాని చెరువు, లక్కవరపుకోటలోని కిత్తన్నకట్టు చెరువుతో పాటు పలుగ్రామాల్లో చెరువులు అలుగుపారుతున్నాయి. చెరువులు జలకళను సంతరించుకోవడంతో రైతులు ఆనందంగా ఉన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష' సర్వే

చీపురుపల్లి రూరల్: మండలంలోని రామలింగాపురం సచివాలయం పరిధి పుర్రేయవలస గ్రామంలో వైద్య సిబ్బంది, వలంటీర్లు గురువారం 'జగనన్న ఆరోగ్య సురక్ష' సర్వే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య సమాచారాన్ని సేకరించారు. అనారోగ్య సమస్యలతో ఉన్న వారి వివరాలను నమోదు చేసుకుని, సచివాలయం వద్ద త్వరలో నిర్వహించనున్న మెడికల్ క్యాంపునకు హాజరు కావాలని ప్రజలకు సూచించారు. సర్వేను వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు ఇప్పిలి అనంతం పర్యవేక్షించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేద ప్రజలకు వరమని ఆయన అన్నారు.

గృహ సారథులకు ఉచితంగా బీమా


బొండపల్లి: మాట్లాడుతున్న మండల జేసీఎస్ ఇన్‌చార్జి రఘు

బొండపల్లి: సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు వైఎస్సార్‌సీపీ రూ.10 లక్షల బీమా ఉచితంగా అందిస్తోందని, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు తమ వివరాలను సంబంధిత యాప్‌లో నమోదు చేసుకోవాలని మండల జేసీఎస్ ఇన్‌చార్జి పల్లి రఘు సూచించారు. మండలంలోని ముద్దూరు, బొండపల్లి గ్రామాల్లోని గృహ సారథులకు బీమా నమోదుపై అవగాహన కల్పించారు. వైఎస్సార్‌సీపీ మండల నా యకుడు బొద్దల చిన్నంనాయుడు, ముద్దూరు, బొండపల్లి గ్రామాల సర్పంచ్‌లు మునకాల పై డిపునాయుడు, బొండపల్లి ఈశ్వరరావు,కోళ్ల వెంకటరమణ,బండారు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గృహసారథులే పార్టీకి పిల్లర్లు

దత్తిరాజేరు: వైఎస్సార్‌సీపీకి క్షేత్రస్థాయిలో సచివాలయ కన్వీనర్లు, గహసారథులే పిల్లర్లని ఆ పార్టీ మండల నాయకుడు రాపాక కృష్ణమూర్తి, పీఏసీఎస్ అధ్యక్షుడు సుమల శ్రీను, టెలీకాం అడ్వయిజరీ బోర్డు మెంబర్ దత్తి చిరంజీవి అన్నారు. పార్టీ తరఫున ఉచితంగా కల్పిస్తున్న బీమా సదుపాయం కోసం కె.కృష్ణాపురంలో సచివాలయ కన్వీనర్లు,గృహసారథుల వివరాలను గురువారం నమోదు చేశారు. పార్టీ కోసం పనిచేసే ప్రతి ఒక్కరికీ పార్టీ అధిష్టానం అండగా ఉంటుందని వారు చెప్పారు.


దత్తిరాజేరు: కె.కృష్ణాపురంలో గృహసారథులతో సమావేశమైన మండల నాయకులు కృష్ణమూర్తి, చిరంజీవి

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి


క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ ప్రమీల, జెడ్పీటీసీ అప్పలనాయుడు

గుర్ల: చదువుతో పాటు క్రీడల్లో రాణించే విద్యార్థులకు ఉన్నత భవిష్యత్ ఉంటుందని ఎంపీపీ పొట్నూరు ప్రమీల, జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు అన్నారు. మండల స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలను స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో గురువారం నిర్వహించారు. ఈ పోటీలను ఎంపీపీ, జెడ్పీటీసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలా మంది విద్యార్థులు మొబైల్ ఫోన్‌లకు అలవాటుపడిపోయి క్రీడలపై ఆసక్తి కనబరచడం లేదని అన్నారు. దీనివల్ల విద్యార్థులకు శారీరక శ్రమతగ్గడంతో పాటు పరీక్షల సమయంలో తీవ్ర ఒత్తిడికి లోనయ్యే అవకాశం ఉందన్నారు. విద్యార్థులంతా తప్పనిసరిగా తరచూ ఆటలు ఆడుతూ ఉండాలన్నారు. క్రీడలకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని చెప్పారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పొట్నూరు సన్యాసినాయుడు, డీఎల్‌డీఏ చైర్మన్ బెల్లాన బంగారునాయుడు, వైస్ ఎంపీపీ తోట తిరుపతిరావు, ఎంఈఓ ఎస్.భానుప్రకాష్, పీఈటీ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.